సాక్షి కర్నూలు

గురువారం : 23 : మే : 2024



వీరభద్రుడికి విశేష అర్చనలు

శ్రీశైలం: స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి బుధవారం లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ విశేష అర్చనలు చేశారు. క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు.



సీమ సిగలో 'విద్యుత్' తేజం

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయం రాయలసీమలోని కర్నూలుకు వచ్చేసింది. జూన్ 2 నుంచి సేవలు అందించనుంది. 8లో▸



చక్రధారి.. కోనేటి వైభవం!

అహోబిలేశుని జయంతి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఎగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులకు తీర్థవారి చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

వంద మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

- సస్పెండ్ చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

కర్నూలు(సెంట్రల్): మే 13వ జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు. గైర్హాజరైన ఉద్యోగులను సంబంధిత శాఖల విభాగాధిపతులు వివరణ కోరి సస్పెండ్ చేయాలన్నారు. విద్యా శాఖలో 79 మంది, ఇతర అన్ని శాఖల్లో కలిపి 21 మంది ఉద్యోగులు ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారు. దీంతో జిల్లా ఎన్నికల సంఘం వారిని గుర్తించి క్రమశిక్షణ చర్యలకు ఉపసంక్రమించింది. తీసుకున్న చర్యలపై తనకు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో విద్యాశాఖలో విధులకు గైర్హాజరైన వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

తొమ్మిది మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 9 మండలాల్లో వర్షం కురిసింది. ఆదోనిలో 20.4మి.మీ, కౌతాళంలో 8.6, ఎమ్మిగనూరులో 8.2, పెద్దకడుబూరులో 5.4, మద్దికెరలో 3,6, సీ.బెళగల్‌లో 3.2, చిప్పగిరిలో 2.0, నందవరంలో 1.4, దేవనకొండలో 0.4 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదైంది. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 83 మి.మీ వర్షం కురిసింది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 107 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. కాగా బుధవారం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. కోడుమూరులో 40.59 డిగ్రీలు, మంత్రాలయంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే నెలలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సబ్సిడీపై వేరుశనగ పంపిణీకి ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకునే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.

రేపు డీఈఈసెట్

కర్నూలు సిటీ: డీఈఈసెట్(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు డీఈఓ కె.శ్యామూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరం నందికొట్కూరు రోడ్డులోని ఐయాన్ డిజిటల్ జోన్(సనత్‌నగర్)లో ఏర్పాటు కేంద్రంలో ఆన్‌లైన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని, నిర్దేశించిన సమయంలోపు వచ్చిన వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. పరీక్షకు మొత్తం 825 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, సమాచారం కోసం 9885716544, 9000822394 నంబర్లను సంప్రదించవచ్చునని డీఈఓ పేర్కొన్నారు.

ఇంటర్‌నెట్, జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలి


కర్నూలు(అర్బన్): జిల్లాలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేయాలని ఉప కార్మిక కమిషనర్ కే వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు కన్వీనర్, డీఈసీ అండ్ రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఉత్తర్వులను అనుసరించి పరీక్షలు నిర్వహిస్తున్న తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆయా కేంద్రాలను మూసివేయాలన్నారు. ఈ ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అభివృద్ధి ఆకాంక్ష

- జిల్లాలో వెనుకబడిన మూడు మండలాలపై ప్రత్యేక దృష్టి
- ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద 49 అంశాల్లో అభివృద్ధికి కార్యాచరణ
- నాలుగేళ్లలో తలసరి ఆదాయం పెంచేందుకు కసరత్తు
- వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు ప్రత్యేక చర్యలు

అవగాహన రాహిత్యం.. నిరక్షరాస్యత వెరసి జిల్లాలోని చిప్పగిరి, హొళగుంద, మద్దికెర మండలాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఇక్కడ మహిళలు, చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోలేక యువత వలస బాట పడుతోంది. వ్యవసాయంలోనూ ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఆస్పిరేషనల్ (ఆకాంక్ష) బ్లాక్ ప్రోగ్రాం కింద 49 అంశాల్లో అభివృద్ధికి జిల్లా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు.





కర్నూలు(అగ్రికల్చర్): దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాలు, మండలాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్(ఏబీపీ)ను రూపొందించింది. ఈ ప్రోగ్రామ్‌ను 2022–23 నుంచి అమలు చేస్తున్నారు. తలసరి ఆదాయం అతి తక్కువగా ఉండటం, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం తదితర 49 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని అత్యంత వెనుకబడిన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. జిల్లాలో చిప్పగిరి, హొళగుంద, మద్దికెర మండలాల్లో తలసరి ఆదాయం తక్కువగా ఉంది. అలాగే పీఎం కిసాన్ వినియోగించుకుంటున్న రైతుల సంఖ్య పరిమితంగా ఉండటాన్ని గుర్తించారు. వ్యవసాయంలో తగిన పురోగతి లేకపోవడం, విద్య, వైద్యంలో వెనకబాటు తనం.. పోషకాహార లేమి, జలవనరులు తక్కువగా ఉండటం తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ మండలాలను ఆస్పిరేషనల్ బ్లాక్‌లుగా గుర్తించారు. ఈ మండలాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంలో ప్రధానంగా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్య, ఉద్యాన, నీటిపారుల, పంచాయతీరాజ్.. తదితర శాఖలు కీలకంగా వ్యవహరిస్తాయి. 2022–23లోనే కేంద్రం ఆస్పిరేషనల్ బ్లాక్‌లకు శ్రీకారం చుట్టినప్పటికి ప్రత్యేక నిధులంటూ ఇవ్వలేదు. 2024–25లో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖల ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తలసరి ఆదాయం పెంపు లక్ష్యంగా...


జిల్లాలోని వివిధ మండలాలతో పోలిస్తే చిప్పగిరి, హొళగుంద, మద్దికెర మండలాల్లో తలసరి ఆదాయం అతి తక్కువగా ఉంది. ప్రజల జీవనోపాధులను మెరుగు పరచి తలసరి ఆదాయం పెంపు లక్ష్యంగా ఈ మండలాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం నాలుగేళ్లు అమలులో ఉంటుంది. ఈ సమయంలో ఈ మండలాలను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. విద్య, వైద్యం, పోషకాహారం, జలవనరులు, రోడ్ల అభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నైపుణ్యాల అభివృద్ధి, స్వచ్ఛమైన తాగునీరు అందించడం.. వీటిలో ప్రధానంగా ఉన్నాయి. వీటిల్లో ప్రగతి సాధిస్తే ఈ ప్రాంతాలు అభివృద్ధి చేయవచ్చే ఆలోచనతో జిల్లా అధికారులు ఉన్నారు.

భూసార పరీక్షల నిర్వహణ

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద వ్యవసాయ ఉత్పాదతకను పెంచాలనేది ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా ఈ మండలాల్లో భూసార పరీక్షల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మండలాల్లో ఈ ఏడాది 4,479 మట్టి నమూనాలు సేకరించి, వాటికి ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను రైతులకు అందజేస్తారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సూక్ష్మపోషకాలు, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదతక సాధించే అవకాశం ఉంది. చిప్పగిరి మండలంలో 1,286, హొళగొంద మండలంలో 1,733, మద్దికెరలో 1,460 ప్రకారం భూసార పరీక్షలు నిర్వహించే విధంగా లక్ష్యాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఈ మండలాల్లో 796 మట్టి నమూనాలు సేకరించారు. ఈ మండలాల్లో అవసరమైన ప్రతి రైతుకు సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించాలనేది లక్ష్యం. సూక్ష్మ సేద్యంతో భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకొని వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఉత్పాదకతను పెంచే అవకాశం ఉంది. పీఎం కిసాన్ నిధులను కూడా ఎక్కువ మంది రైతులు వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు.

పండ్లతోటల అభివృద్ధి

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద పండ్లతోటల అభివృద్ధిని కూడా ప్రోత్సహిస్తారు. ఇందుకోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించనున్నారు. అర్హత ఉన్న ప్రతీ రైతు పండ్లతోటలు అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించనున్నారు. వలసల నియంత్రణకు అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్నారు. అలాగే యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరచనున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మహిళల జీవనోపాధులను అభివృద్ధి చేస్తారు. విద్య, వైద్యం పోషకాహారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. 49 అంశాలపై ప్రత్యే దృష్టి సారించి ఈ మండలాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు.



ఆస్పిరేషనల్ బ్లాక్స్‌పై ప్రత్యేక దృష్టి



దేశంలో అత్యంత వెనుకబడిన 500 మండలాలను కేంద్ర ప్రభుత్వం ఆస్పిరేషనల్ బ్లాక్స్‌గా గుర్తించింది. ఇందులో కర్నూలు జిల్లాలో చిప్పగిరి, హొళగుంద, మద్దికెర మండలాలు ఉన్నాయి. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ మండలాల్లో వెనుకబాటు తనాన్ని నివారించి అన్ని విధాలా అభివృద్ధి చేయాలనేది ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లేకపోయినప్పటికీ ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన పథకాల అమలులో ఈ మండలాలకు ప్రాధాన్యత ఇస్తాం. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా అన్ని రంగాల్లో ప్రగతి సాధించడానికి చర్యలు తీసుకుంటున్నాం. 2024–25లో ఆస్పిరేషన్ బ్లాక్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. దీంతో ఈ మండలాలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

– డాక్టర్ జి.సృజన, జిల్లా కలెక్టర్, కర్నూలు

57 కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- కేంద్రాల్లో గదిగదికి సీసీ కెమెరాల ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఉమ్మడి కర్నూలు జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. బుధవారం స్థానిక ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12వరకు, మధ్యాహ్నం 2.30 సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు వచ్చే నెల 1వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ జనరల్ విభాగం నుంచి 15,076 మంది, వొకేషనల్ విభాగం నుంచి 905 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు జనరల్ విభాగం నుంచి 6194 మంది, వొకేషనల్ విభాగం నుంచి 768 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో గది గదికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంతగా పరీక్షలు రాసేందుకు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 10 కేంద్రాలకు రవాణా సదుపాయం కల్పించాలని ఇప్పటికే ఏపీ ప్రజా రవాణా వ్యవస్థ అధికారులను కోరామన్నారు. ప్రతి కేంద్రం దగ్గర 144 సెక్షన్‌లో అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల్లోకి ఒక్క నిమిషం ఆలస్యమైనా కూడా అనుమతించేది లేదన్నారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ మాత్రమే తెచ్చుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించేది లేదన్నారు. విలేకరుల సమావేశంలో డీఈసీ మెంబర్లు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభుచరణ్ పాల్గొన్నారు.

జూన్ 2 నుంచి ఆన్‌లైన్‌లో మూల్యాంకనం

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిసిన అనంతరం జూన్ 2వ తేదీ నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అంశాలపై అధ్యాపకులకు బుధవారం ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయం ఎగ్జామినేషన్ కంట్రోలర్ సుబ్బారావు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతి అధ్యాపకుడికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ బోర్డు నుంచే కేటాయిస్తారన్నారు. పరీక్షలు ముగిసిన తరువాత స్పాట్ కేంద్రం దగ్గర సమాధాన పత్రాలు స్కాన్ చేసి ఆయా సబ్జెక్టుల అధ్యాపకుల యూజర్ ఐడీకి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అధ్యాపకులు ఇంటి దగ్గర కానీ, వారు పని చేసే కాలేజీల్లో ఎక్కడైనా మూల్యాంకం చేయవచ్చునని, అయితే వెబ్ కెమెరాలు ఉండాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 ల నుంచి రాత్రి 7 గంటల వరకు మూల్యాంకనం చేయాల్సి ఉంటుందన్నారు. మూల్యాంకనానికి ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం జిల్లాకు చెందిన సమాధాన పత్రాలు స్కానింగ్‌కి జిల్లాకు రానున్నాయి. అనంతరం ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి మూల్యాంకనం చేసే విధానంపై అధ్యాపకులను పలు సూచనలు చేశారు.

చూపునిస్తూ.. సేవలు మెరుస్తూ!

- ఎమ్మిగనూరు యాభై పడకల ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు
- జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన ఆసుపత్రి



ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాల



కంటి ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ చిరంజీవి

ఎమ్మిగనూరు రూరల్: నయనం ప్రధానం అన్నారు పెద్దలు. చూపు లేకపోతే వారి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుంది. కంటి చూపుకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మినూరు ఏపీ వైద్యవిధాన పరిషత్ కమ్యూనిటీ వైద్యశాలలో రోగులకు కంటి ఆపరేషన్లు చేసే సౌకర్యం కల్పించారు. యాభై పడకల ఈ ఆసుపత్రిలో విరివిగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. కంటి శస్త్రచికిత్స చేయడంలో రాష్ట్రంలో మూడోస్థానం, జిల్లాలో ప్రథమస్థానంలో ఈ ఆసుపత్రి నిలిచింది.

తొలగిన ఇబ్బందులు

వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్న పిల్లల నుంచి పెద్ద వయస్సు వారి వరకు కంటిచూపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గతంలో కంటి చూపు మందగించిన వృద్ధులు, మహిళలు, యువకులు ఆపరేషన్ చేయించుకోవాలంటే కర్నూలు, రాయచూర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. డబ్బులు కూడా ఖర్చు చేసుకోవాల్సి ఉండేది. ఇప్పుడు ఈ ఇబ్బందులు పడకుండా ఎమ్మిగనూరులో ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. కమ్యూనిటీ వైద్యశాలకు ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. కంటి శుక్లాలు ఉన్న వారికి చికిత్స చేసి లెన్స్‌ను అమరుస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ఆపరేషన్లు

గతంలో వంద పడకల ప్రభుత్వాసుపత్రుల్లో మాత్రమే కంటి ఆపరేషన్లు చేసేవారు. ఎమ్మిగనూరు కమ్యూనిటీ వైద్యశాలలో కంటి ఆపరేషన్లు చేస్తున్నారే ప్రచారం ఇతర ప్రాంతాలకు విస్తరించటంతో రోజు రోజుకు ఆపరేషన్లు చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. 2022లో 361 మంది ఆపరేషన్లు చేయించుకున్నారు. 2023లో 684 మందికి, 2024లో ఇప్పటి వరకు 154 మందికి ఆపరేషన్లు చేశారు. కంటి ఆపరేషన్లలో ఎమ్మిగనూరు యాభై పడకల ఏపీ వైద్యవిధాన పరిషత్ కమ్యూనిటీ వైద్యశాల రాష్ట్రంలో మూడో స్థానం, జిల్లాలో మొదటి స్థానంలో నిలచింది. ప్రతి నెలా 35 నుంచి 50 మందికి ఇక్కడ ఆపరేషన్లు చేస్తున్నారు. ఆపరేషన్లు చేసిన తరువాత ఉచితంగా వారికి కంటి అద్దాలను కూడా ఇస్తున్నారు.

తేదీలు ఇచ్చి ఆపరేషన్లు చేస్తున్నాం

కంటి ఆపరేషన్లు చేస్తుండటంతో రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడ రోగులకు సరిపడా బెడ్స్ లేవు. ప్రత్యేక గదులు లేవు. దీంతో ఆపరేషన్లు వచ్చే వారికి తేదీలు ఇస్తున్నాం. వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే సమస్య ఉండదు. చుట్టు పక్కల ప్రాంతాల వారు ఉచితంగా చేస్తున్న కంటి ఆపరేషన్లను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ చిరంజీవి, కంటి వైద్యులు, ఎమ్మిగనూరు

సంక్షేమంలో పదోన్నతులు



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

కర్నూలు(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖలో పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే గ్రేడ్–1 వసతి గృహ సంక్షేమాధికారులుగా కొనసాగుతున్న వారికి సీనియారిటీ ప్రకారం సహాయ సంక్షేమాధికారులుగా పదోన్నతి కల్పించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి గ్రేడ్–1 హెచ్‌డబ్ల్యూల సర్వీసు వివరాలను పంపాలని ఆ శాఖ డైరెక్టర్ విజయక్రిష్ణన్ మెమో(ఆర్‌సీ ఏ4/2523/2024) జారీ చేశారు. పదోన్నతులకు సంబంధించి త్వరలో డీపీసీ ఏర్పాటు చేయనున్న దృష్ట్యా ఏఎస్‌డబ్ల్యూఓ పోస్టుకు అర్హులైన గ్రేడ్–1 వసతి గృహ సంక్షేమాధికారుల వివరాలను ఈ నెల 25లోగా పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11 మంది గ్రేడ్–1 వసతి గృహ సంక్షేమాధికారులు ఉన్నారు. వీరిలో ఎస్.వెంకటరాముడు(నెం.1 పత్తికొండ), ఎం.అంబటిరెడ్డి(నంద్యాల), డి.అబ్దుల్‌జలీల్(బనగానపల్లె), కేసీ రాముడు(దొర్నిపాడు), ఆర్.నాగేశ్వరరెడ్డి(ఎరుకలచెరువు), బి.బెన్నమ్మ(కర్నూలు), బి.అంకన్న(వెంకటాపురం), ఈ.వెంకటేశ్వర్లు(కంభాలపాడు), బి.రజనమ్మ(కర్నూలు), ఎ.ప్రమీలారాణి(ఓర్వకల్), ఎస్.నాగరాజు(పత్తికొండ) ఉన్నారు. వీరందరి ఏసీఆర్‌లు పంపే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, నిర్ణీత సమయంలోగా డీపీసీ జరిగితే రాష్ట్రంలోని వివిధ జోన్లలో ఉన్న ఖాళీ పోస్టులు కొందరితోనైనా భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జే.రంగలక్ష్మీదేవి మాట్లాడుతూ డైరెక్టరేట్ కోరిన విధంగా గ్రేడ్–1 వసతి గృహ సంక్షేమాధికారుల వివరాలను పంపుతున్నామన్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు

- కట్టుదిట్టమైన భద్రతకు ప్రణాళిక
- ఊరేగింపు, విజయోత్సవాల ర్యాలీలపై నిషేధం
- కొనసాగనున్న 144 సెక్షన్, 30 పోలీస్ చట్టం

కర్నూలు: సార్వత్రిక ఎన్నిక కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు గడువు దగ్గర పడుతోంది. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పోలింగ్ ఘట్టంలో చెదురు ముదురుగా చోటు చేసుకున్న ఘటనలు తిరిగి ఓట్ల లెక్కింపు సమయంలో పునరావృతం కాకుండా పటిష్టమైన బందోబస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధమయ్యింది. కర్నూలు శివారులోని నంద్యాల రోడ్డులో ఉన్న రాయలసీమ యూనివర్సిటీలోని మూడు బ్లాకుల్లో ఈవీఎంలు ఉంచిన 16 స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతోంది. కట్టుదిట్టమైన భద్రతతో పాటు అక్కడ నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు రోజు కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా చూసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

హింసాత్మక సంఘటనలను దృష్టిలో పెట్టుకుని...

పోలింగ్ అనంతరం వివిధ నియోజకవర్గాల్లో జరిగిన చెదురుమదురు సంఘటనలను దృష్టిలో పెట్టుకుని కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో ఒక పార్లమెంటు, ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల వారీగా హింసకు తావు ఉన్న ప్రాంతాలు, వ్యక్తులను గుర్తించి నివేదిక ఇవ్వాలని కమిషన్ నుంచి ఆదేశాలు ఉన్నాయి. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు ఒకటి రెండు రోజుల ముందు, ఆ తర్వాత గొడవలు జరిగే అవకాశం ఉండే ప్రాంతాలు, గ్రామాలను ఇప్పటికే గుర్తించారు. జూన్ 1న ఎగ్జిట్ పోల్స్, 4వ తేదీ ఎన్నికల ఫలితాలు రానున్న దృష్ట్యా సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో పికెట్, పోలీస్ పెట్రోలింగ్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలతో పాటు 2021 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎఫ్ఐఆర్, ఇతర రికార్డులో నిందితులను గుర్తించి వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేశారు. రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణం చుట్టుపక్కల ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు రోజు జిల్లాలో ఎక్కడ కూడా ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. పోలింగ్ రోజు నుంచి జిల్లాలో సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ కొనసాగనుంది. ఓట్ల లెక్కింపు రోజు గొడవలు జరిగే ఆస్కారమున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు వాటిని ఎదుర్కోవడానికి అవసరమైన పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

సబ్సిడీ వేరుశనగకు చురుగ్గా పేర్ల నమోదు



కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగకు ఆర్‌బీకేల్లో పేర్ల నమోదు చురుగ్గా జరుగుతోంది. బుధవారం సాయంత్రానికి 4వేల క్వింటాళ్లకు రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటికే ఏపీ సీడ్స్ 3వేల క్వింటాళ్ల వేరుశనగను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచింది. ముందస్తు వర్షాలు పడుతుండటంతో వేరుశనగకు డిమాండ్ పెరిగింది. ఆదోని ప్రాంతంలో నాన్ సబ్సిడీ చెల్లించిన రైతులకు వేరుశనగ ప్యాకెట్లను పంపిణీ చేయడం కూడా మొదలు పెట్టడం విశేషం.

క్లుప్తంగా

డెంగీ కేసులపై ఆరా



కరివేములలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో గతంలో వచ్చిన డెంగీ కేసులపై రాష్ట్ర కన్సల్టెంట్స్ పరీలకులు కొండారెడ్డి రామచంద్ర, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర సాయిబాబా బుధవారం ఆరా తీశారు. గ్రామంలో దోమల లార్వా ఎక్కడైనా ఉందేమో అని పరిశీలించారు. వైద్యసిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. జ్వరం కేసులు ఉంటే రక్తపూత నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రంగస్వామి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



గ్రిల్‌లో ఇరుక్కుపోయిన మహిళను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

ఆదోని అర్బన్: డ్రైనేజీ గ్రిల్‌లో ఇరుక్కుపోయిన మహిళను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. గత రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీలు నిండిపోయాయి. కౌతాళం గ్రామానికి చెందిన సుశీల బంధువులు బెంగళూరుకు వలస వెళ్లేందుకు మంగళవారం రాత్రి ఆదోని రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నారు. స్థానిక పాత ఓవర్ బ్రిడ్జి కింద రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో రోడ్డు మధ్యలో డ్రెయినేజీ ఉంది. నీరు నిల్వ ఉండడంతో రాత్రి కనిపించక సుశీల కాలు డ్రెయినేజీలో గ్రిల్‌లో ఇరుక్కుపోయింది. బయటికి తీసేందుకు వీలుకాకపోవడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇనుప గ్రిల్‌ను జేసీబీతో తొలగించి మహిళను రక్షించారు. అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం నలుగురు డిబార్ అయ్యారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 2,426 మందికి 2,178 మంది, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 8,153 మందికి 7,494 మంది విద్యార్థులు హాజరయ్యారని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నందికొట్కూరు సాయిరాం డిగ్రీ కళాశాలలో 3, నంద్యాల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమవుతుందని ఆదోని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆస్పరి రహదారిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు విద్యార్థులు కళాశాలను ఎంపిక చేసుకునేందుకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకొనవచ్చునని వివరించారు. జూన్ 5వ తేదీన వెబ్ ఆప్షన్స్ మార్చుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. 7న సీట్లు కేటాయింపు, 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆయా కళాశాలలో ప్రవేశాలు జరుగుతాయని వివరించారు. జూన్ 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఏమైనా సందేహాలుంటే 79016 20203 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చక్రధారి.. కోనేటి వైభవం!

- ఎగువ అహోబిలంలో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం
- దిగువలో కనుల పండువగా కలశ తిరుమంజనం



ప్రాయశ్చిత్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు



చక్రస్నానంను తిలకిస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: అహోబిల జయంతి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఎగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులకు తీర్థవారి చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వాములను ప్రత్యేకంగా అలంకరించి భవనాసి గుండం వరకు తోడ్కొని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వస్త్రాలు మార్చి వేద పండితులు, అర్చకులు.. స్వామి అమ్మవార్ల ఎదుట సుదర్శనమూర్తి, నిత్య అభిషేకమూర్తులకు కలిపి పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. సుదర్శనమూర్తికి, నిత్య అభిషేక ఉత్సవమూర్తికి కోనేరులో శాస్త్రోక్తంగా తీర్థవారి చక్రస్నానం చేయించారు. ఉత్సవ మూర్తులతో పాటు, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది,భక్తాదులు శాస్త్రోక్తంగా తీర్థవారి చక్ర స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రాయశ్చిత్య హోమం నిర్వహించారు.

దిగువలో ..

దిగువ అహోబిలంలో కలశ తిరుమంజనంలో భాగంగా ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం 108 కళశాలతో తిరుమంజనం నిర్వహించి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



ఎగువ అహోబిలంలో స్వామికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

మహానందిలో 30న హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో ఈ నెల 30న హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఈఓ విలేకరులతో మాట్లాడుతూ శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయక నంది ఆలయాల్లోని హుండీ కానుకలు లెక్కిస్తామన్నారు. వీటితో పాటు అన్నప్రసాదం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకల లెక్కింపు చేపడతామన్నారు. స్థానిక అభిషేక మండపంలో జరిగే లెక్కింపు కార్యక్రమానికి సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ (21) బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. నాగరాజు, మహేశ్వరిల కుమారుడు వెంకటరమణ బుధవారం సొంత పొలంలో విత్తనం వేస్తుండగా ప్రమాదవశాత్తూ వ్యవసాయ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ప్రతిభ ఉంటే.. ఉపకారం మీ వెంటే

- విద్యార్థులకు విద్యాదాన్ స్కాలర్ షిప్
- జూన్ 7 వరకు దరఖాస్తుకు గడువు

నంద్యాల (న్యూటౌన్): చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం సరోజినీ దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలవుతోంది. ఇప్పటి వరకు ఈ పథకం కింద 6,500 మందికి పైగా ఆర్థిక సాయం, 27,600 మంది వరకు స్కాలర్‌సిప్‌లు అందజేశారు. ఎంపికైన విద్యార్థులు రెండేళ్ల పాటు ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందవచ్చు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా, నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్‌షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుంది. విద్యార్థి చదువుతున్న కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకు ఉపకార వేతనం అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఈ ప్రోగ్రాం ద్వారా భవిష్యత్‌కు అవసరమైన దిశానిర్దేశం చేస్తారు.

విద్యార్థుల అర్హతలు

సరోజినీ దామోదర్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనం పొందాలంటే విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.2 లక్షలలోపు ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియెట్ చదువుతున్న వారై ఉండాలి. పదిలో కనీసం 90 శాతం మార్కులు సాధించి ఉండాలి. దివ్యాంగులైతే 75 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక విధానం

చదువులో చూపిన ప్రతిభ, ధ్రువపత్రంలో తెలిపిన సమాచారం ఆధారంగా ఎంపిక చేస్తారు. జూన్ 23న దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా సమాచారం తెలియజేస్తారు. ఎంపికైన విద్యార్థులు జూన్ 20 నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

జూన్ 7వ తేదీ వరకు గడువు

విద్యాదాన్ ఉపకార వేతనం కోసం జూన్ 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఈ ఏడాది తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, చదువుతున్న కళాశాల వివరాలను పొందుపర్చాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వారు వ్యక్తిగతంగా ఇతరుల ఈ మెయిల్ ఐడీలను అనుమతించరు. భవిష్యత్తులో ఎస్‌డీఎఫ్ నుంచి ఎటువంటి సమాచారమైనా ఈ మెయిల్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. అందుకే సొంత ఈ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకుని, దాని పాస్‌వర్డ్ గుర్తుంచుకోవాలి. మరిన్ని వివరాల కోసం విద్యాదాన్ ఆంధ్రః ఎస్‌డీ ఫౌండేషన్ ఇండియా.కామ్ సంప్రదించాలి. లేదా 96635 17131 నంబర్‌లో సంప్రదించవచ్చు.

సీమ సిగలో 'విద్యుత్' తేజం

- కర్నూలులో ఏర్పాటైన ఏపీఈఆర్‌సీ కార్యాలయం
- నేడు భవనాన్ని ప్రారంభించనున్న చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి
- జూన్ 2 నుంచి అందనున్న సేవలు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఏపీఈఆర్‌సీ భవనం

కర్నూలు(అగ్రికల్చర్): ఇప్పటి వరకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయం రాయలసీమలోని కర్నూలుకు వచ్చేసింది. జూన్ 2 నుంచి సేవలు అందించనుంది. సొంతభవనంతో సహా కర్నూలులో ఏపీఈఆర్‌సీ రాష్ట్రస్థాయి ప్రధాన కార్యాలయం ఏర్పాటైంది. విద్యుత్ వ్యాపారం చేయడానికి, అమ్మడానికి ఏపీఈఆర్‌సీ నుంచి లైసెన్స్ తప్పనిసరి. విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితోనే టారిఫ్‌లు నిర్ణయిస్తారు. విద్యుత్ చార్జీలు పెంచడానికి, తగ్గించడానికి కూడా నియంత్రణ మండలి అనుమతి అవసరం. విద్యుత్ శాఖకు ఏపీఈఆర్‌సీ కోర్టు వంటిది. దీని అనుమతితోనే ఏ విషయంలోనైనా ముందుకు సాగాల్సి ఉంది. ఇటువంటి కీలకమైన ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కర్నూలులో ఏర్పాటు కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతోనే ఇది సాధ్యమైంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి భవన సముదాయాన్ని చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి గురువారం ఉదయం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో రాజకీయాలతో సంబంధం లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చర్యలు చేపట్టింది. కర్నూలు శివారులోని 220 కేవీ కార్బైడ్ సబ్ స్టేషన్‌కు చెందిన 2 ఎకరాల స్థలంలో 2023 జూన్‌లో ఏపీఈఆర్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోపే భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం కావడం విశేషం. భవన నిర్మాణ పనుల పురోగతిని చైర్మన్ నాగార్జునరెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ... సలహాలు, సూచనలు ఇచ్చారు. చైర్మన్ నాగార్జునరెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎం సంతోష్‌రావు తీసుకున్న చొరవతో ఏడాదిలోపే పనులు పూర్తి కావడం, ప్రారంభోత్సవం కూడా చేపడుతుండటం విశేషం. రూ.23 కోట్లతో భవనాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారు. ఇప్పటి వరకు ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. హైదరాబాద్‌లో ఉన్న ఈ కార్యాలయం కర్నూలులో ఏర్పాటు కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి భవనం ముగింపు పనులను ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, ఏపీఈఆర్‌సీ టెక్నికల్ మెంబరు ఠాంగింగ్, ఫైనాన్స్ మెంబరు వెంకటరామారెడ్డి పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి కూడ పరిశీలించారు. గురువారం ఏపీఈఆర్‌సీ భవనాన్ని ప్రారంభిస్తుండగా... జూన్ 2 నుంచి కర్నూలు కేంద్రంగా ఈ కార్యాలయం పని చేస్తుంది. 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీఈఆర్‌సీ భవనం, 5,000 అడుగుల విస్తీర్ణంలో గెస్ట్‌హౌస్ నిర్మించారు.

ఘనంగా ప్రసాదం పంపిణీ





పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి, మట్టి పాత్రల్లో ప్రసాదాన్ని తీసుకొస్తున్న దృశ్యం

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసులో భాగంగా బుధవారం సఫ్‌రాలుట్‌న (ప్రసాదం పంపిణీ) కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఘనంగా జరిగింది. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ఇంట్లో మట్టి కుండల్లో ప్రత్యేంగా తయారు చేసిన తీపి పదర్థాన్ని డప్పువాయిద్యాలు, బ్యాండుమేళాల మధ్య, ధర్మకర్త ఇంటి నుంచి మట్టి పత్రాల్లో దర్గాకు తీసుకొచ్చారు. ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనల అనంతరం ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ప్రసాదాన్ని ముగ్గురు భక్తులకు పంపిణీ చేశారు. ప్రసాదాన్ని పొలంలో పాతితే పంట బాగపండుతుందని, రోగం ఉన్నవారు తింటే స్వస్థత చేకూరుతుందని భక్తుల నమ్మకం. దీనిని మట్టి పాత్రల్లోనే తీసుకోని పోవడం ఇక్కడ భక్తుల ఆచారం. ప్రసాదం భక్తులు పోటీపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.21లక్షల విలువ చేసే 130 సెల్‌ఫోన్లు స్వాధీనం



విలేకరుల సమావేశంలో నిందితున్ని, రికవరీ చేసిన సెల్‌ఫోన్లు, నగదు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

డోన్ టౌన్: పట్టణంలోని చిగురమానుపేటలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో రూ.21 లక్షల విలువ చేసే 130 సెల్ ఫోన్లు, రూ.1,48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్‌ని దృష్టిలో పెట్టుకొని కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. పట్టణంలో సమస్యాత్మకమైన చిగురమానుపేటలో పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, అస్రత్‌బాషా, పట్టణ, రూరల్ ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో పాటు జలదుర్గం ఎస్ఐ విజయ్‌కుమార్‌లు మూడు పోలీసు స్టేషన్ల సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారన్నారు. ఇందులో భాగంగా కాలనీకి చెందిన ఎరుకలి రవి అలియాస్ పిలక రవి ఇంట్లో తనిఖీలు చేస్తుండగా ఒక లగేజ్ బ్యాగ్‌లో దొంగలించుకొచ్చిన 130 సెల్‌ఫోన్లు, రూ.1,48,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రవిని అదుపులోకి తీసుకొని విచారించగా అతని సమీప బంధువులు ఎరుకలి నవాగ్ మరియు ఎరుకలి పవన్‌లు తమిళనాడు రాష్ట్రంకు వెళ్ళి అక్కడ రద్దీగా ఉన్న ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగలించేవారన్నారు. వాటిని రవికి ఇవ్వగా హైదరాబాద్‌కు తీసుకెళ్ళి మహమ్మద్ ఖాజా నిజాముద్దీన్ అలియాస్ ఖైజర్‌కు ఒట్టుగా అమ్ముతున్నట్లు వెల్లడైందన్నారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.21 లక్షలు ఉంటుందన్నారు. పైన తెలిపిన ముద్దాయిలు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేటి నుంచి అల్లీపీరా స్వాముల ఉరుసు



అల్లీపీరస్వాముల సమాధులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరా స్వాముల ఉరుసు గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా బుధవారం దర్గా ట్రస్టీ ప్రెసిడెంట్ గురు గాజీహుసేన్‌పీరా స్వాములు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఉరుసు మహోత్సవాలు ఉంటాయని, నేడు గంధం, రేపు ఉరుసు ఉంటుందని చెప్పారు. ఈ మహోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. దాదాపు లక్షకు పైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ చేపట్టనున్నారు.

ఇద్దరు మహిళల మృతికి కారణమైన ఆటోడ్రైవర్ అరెస్ట్

కర్నూలు : గార్గేయపురం గ్రామ పొలిమేరలోని నగర వనం చెరువులో ఇద్దరు మహిళల మృతికి కారణమైన ఆటోడ్రైవర్ ఎస్.మహబూబ్ బాషాను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. నగర వనంలోని చెరువులో మహిళా మృతదేహాలు నీటిపై తేలాడుతున్నట్లు ఈనెల 19వ తేదీ గార్గేయపురం వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు డీఐజీ విజయరావు, ఎస్పీ కృష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డీఎస్పీ విజయశేఖర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. వారి ఆదేశాల మేరకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి పక్కా సమాచారంతో ఆటోడ్రైవర్ మహబూబ్ బాషా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు నిర్ధారించుకుని అరెస్టు చేసి జైలుకు పంపారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అరుణ, జానకి కర్నూలులోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా వ్యభిచార వృత్తిలో ఉంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కర్నూలు నగరానికి చెందిన ఆటో డ్రైవర్ మహబూబ్ బాషాకు జానకితో పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత వారి మధ్య మనస్పర్థలు ఏర్పడి వేరే వ్యక్తుల చేత ఆటోడ్రైవర్‌ను కొట్టించిన సంఘటనను మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్నాడు. జానకిపై ప్రతీకారం తీర్చుకోవాలని అవకాశం కోసం ఎదురుచూస్తున్న మహబూబ్ బాషా ఈనెల 18వ తేదీన జానకి, అరుణలను ఆటోలో ఎక్కించుకుని గార్గేయపురం శివారులోని నగరవనం చెరువు వద్దకు చేరుకున్నారు. వారు బట్టలు ఉతుక్కుంటుండగా జానకిని వెనకవైపు నుంచి మహబూబ్ బాషా నీటిలోకి తోసేశాడు. ఈ క్రమంలో ముద్దాయి కూడా నీటిలో పడిపోగా గట్టున ఉన్న అరుణ అతనిని కాపాడే క్రమంలో నీటిలో పడిపోయింది. అయితే వారిని వదిలేసి ఆటోడ్రైవర్ గట్టుకు చేరుకుని ఆ రోజు నుంచి కనపడకుండా తిరుగుతుండటంతో అనుమానం వచ్చి పోలీసులు అతనిపై నిఘా వేసి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతనిని జైలుకు పంపినట్లు తాలూకా సీఐ శ్రీధర్ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందిద్దాం



శిక్షణ ముగించుకున్న ఏహెచ్‌ఏలతో పశువైద్య అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): చిన్న వయస్సులోనే ఉద్యోగాలు సంపాదించుకున్నారని, నోరు లేని మూగ జీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని నూతన అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (ఏహెచ్ఏ)కు కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసన్నబాబు సూచించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏహెచ్‌ఏలుగా ఎంపికైన కర్నూలు డివిజన్‌లోని 55 మందికి కర్నూలు బహుళార్థ పశువైద్యశాలలోని ట్రైనింగ్ సెంటర్‌లో 45 రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణా కాలంలో పలువురు పశువైద్య అధికారులు ఏహెచ్‌ఏల విధులు, బాధ్యతలు, పశువైద్యానికి సంబంధించిన సాంకేతిక సలహాలు, తదితరాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కర్నూలు డివిజన్ డీడీ దుర్గా ప్రసన్న బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యానికి తావు ఇవ్వరాదన్నారు. ఉద్యోగ ధర్మాన్ని జవాబుదారీతనంతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, విశ్రాంత జేడీ డాక్టర్ రామచంద్రయ్య, ట్రైనింగ్ సెంటర్ ఏడీ సుధాకర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై సెబ్ కొరడా

- 13 ట్రాక్టర్లు, 56 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో సెబ్ అధికారులు

కర్నూలు: ఇసుక అక్రమ రవాణాపై సెబ్ అధికారులు కొరడా ఝళిపించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై నిఘా వేసి మొత్తం 13 ట్రాక్టర్లతో పాటు 56 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశారు. సెబ్, డీటీఎఫ్, ఇంటెలిజెన్స్ విభాగం సిబ్బంది బృందాలుగా ఏర్పడి కర్నూలు సెబ్ స్టేషన్ పరిధిలో 9 ట్రాక్టర్లతో పాటు 36 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి రూ.90 వేల అపరాధ రుసుం విధించారు. నిడ్జూరు గ్రామానికి చెందిన షేక్ సుభాన్ బాషా, మునగాలపాడుకు చెందిన వడ్డె వెంకటేష్, కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి చెందిన బోయ గడ్డం నాయుడు, కర్నూలుకు చెందిన శ్రీకృష్ణ, కురువ భీమలింగడు, ఎం.నాగన్న, నరేష్, బోయ నడిపి రంగస్వామిలకు చెందిన ట్రాక్టర్లతో పాటు మునగాలపాడు, జొహరాపురం ప్రాంతాల్లో అనుమతి లేకుండా హంద్రీ, తుంగభద్ర నదుల నుంచి ఇసుకను తరలించి ఒక్కో ట్రాక్టర్ రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం అందుకున్నారు. ఈ మేరకు కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే ఆదోనిలో రెండు ట్రాక్టర్లతో పాటు 10 మెట్రిక్ టన్నుల ఇసుక, పత్తికొండలో రెండు ట్రాక్టర్లతో పాటు 10 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే 8008828467, 9000067587, 8328052562 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.